## క్లుప్తంగా

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన రావుల శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడితో 2001లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఇద్దరు పిల్లల పేరుపై రూ.70 వేలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్‌తో చేశారు. అలాగే ఆర్థికసాయం అందించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



పరకాల : ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో శనివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గందె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా శివాజీ, కోశాధికారిగా ఎర్ర రామన్నను ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ నూతన కార్యవర్గం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మిత్రనగర్, డాక్టర్స్ కాలనీ, ప్రణయభాస్కర్ కాలనీ, కేఎన్ఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### కాజీపేట జంక్షన్‌లో డ్రగ్స్ కంట్రోల్ బృందం తనిఖీ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో శనివారం డ్రగ్స్ కంట్రోల్ బృందం తనిఖీలు చేపట్టింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలనుసారం డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీస్ జాగిలంతో ముమ్మర తనిఖీ చేపట్టారు. ప్లాట్‌ఫాంలు, ప్రయాణికుల వేచి ఉండు గదులను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులను, బ్యాగులను తనిఖీ చేశారు. అలాగే రైల్వే పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆర్.ఐ.శివకేశవులు, పాల్గొన్నారు.

### ఉపాధిపై డీఆర్‌డీఓ ఆగ్రహం

- విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి : మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై డీఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు విచారణకు ఆదేశించారు. 'ఉపాధిహామీ'లో అక్రమాలు అనే కథనం 'సాక్షి'లో శనివారం ప్రచురితమైంది. ఈ కథనానికి డీఆర్డీఓ మేన శ్రీను స్పందించి సమగ్ర నివేదిక అందించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

**20న విచారణ**

మండలంలోని అన్నాసాగరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథక పనులపై ఈనెల 20న విచారణ జరుపుతున్నట్లు ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. విచారణకు కూలీలు హాజరు కావాలని సూచించారు.

### సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

న్యూశాయంపేట : దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితుల దృష్ట్యా జూలై 9కి వాయిదా పడిన సార్వత్రిక సమ్మె సన్నాహాలను కొనసాగించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు సదానందం, ఓదేలు, రాజేందర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రియరాణికి డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు వై. ప్రియరాణికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. హ్యూమన్ రిసోర్స్ ప్లానింగ్ అండ్ రిటెన్షన్ స్ట్రాటజీస్ ఇన్ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ప్రియరాణికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె రాజేందర్ తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ (తెలంగాణ యూనివర్సిటీ వీసీ) టి.యాదగిరిరావు పర్యవేక్షణలో ప్రియరాణి తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

# నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



ప్రమాదకరంగా నార్లాపూర్- పరకాల రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- ఏడాదిన్నర క్రితం నార్లాపూర్- పరకాల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నడికూడ : నార్లాపూర్- పరకాల రోడ్డులో ప్రయాణిస్తున్నారా.. జాగ్రత్త సుమా అంటూ తోటి ప్రయాణికులు పలువురిని ముందస్తుగా హెచ్చరిస్తున్నారు. ఆ రోడ్డుపై అడుగుకో గుంత, నూతనంగా నిర్మించిన ఎత్తైన కాల్వర్టులతో ప్రమాదకరంగా ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చొరవతో మల్లక్కపేట క్రాస్ రోడ్డు నుంచి నార్లపూర్ వరకు 15 కిలో మీటర్లకు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఏడాదిన్నర క్రితం డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే కేవలం నార్లపూర్ -పరకాల మధ్య కల్వర్టులు నిర్మించి వదిలివేయడంతో వాహనదారులకు శాపంగా మారింది. సంవత్సరం సమీపిస్తున్నా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్నారు. పలు చోట్ల రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు.

**రాత్రివేళల్లో ఇబ్బందులు**

కొత్తగా ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. మలుపులు, గుంతలను చూస్తే 'ఇదేం రోడ్డు' అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. నార్లాపూర్ నుంచి నిత్యం పరకాలకు ఏదో ఒక పనిపై ఆటోలు, వాహనాలు వెళ్లాల్సి వస్తోంది.

**కనిపించని హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు**

రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని రెడ్ స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రానున్న వర్షకాలంలో రోడ్డు పరిస్థితి ఇలానే ఉంటే, ఏదైనా భారీ ప్రమాదం సంభవిస్తుందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

#### ఎమ్మెల్యే చొరవచూపాలి



డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయి దాదాపు సంవత్సరం సమీపిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించడం లేదు. వాహనదారులు ఏమరపాటుగా ఉంటే కచ్చితంగా గుంతలో పడి గాయపడాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నాం.

– రాజు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, నార్లాపూర్

#### ప్రమాదకరంగా ఉంది



వాహనదారులకు డబుల్ రోడ్డు నిర్మాణ పనుల వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నూతనంగా నిర్మించిన ఎత్తైన కాల్వర్టులను రాత్రి సమయంలో గుర్తించకపోతే భారీ ప్రమాదం జరిగేలా ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

– రాజిరెడ్డి, రామపర్తి, బీఆర్ఎస్ నాయకులు

## పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బహుజన్ రాజ్యాధికార పార్టీ మహిళా నాయకులు

హన్మకొండ : హైదరాబాద్‌లో జూన్ 7న జరిగే బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు పీసరి రజిత పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో పార్టీ ఆవిర్భావ సభ కరపత్రాలను మహిళా నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సదర్భంగా రజిత మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా బహుజన్ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మరియ, ఎండీ. సాహిదా, కవిత, స్వప్న, అంజి, రాధ, సంపూర్ణ, వనమ్మ, స్రవంతి, భవ్యశ్రీ, శ్రీలత, మచ్చిక విజయ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో సంఘం నిర్వాహకుడు

ఖిలా వరంగల్: నెలవారీగా ప్రజలు పొదుపు చేసుకున్న డబ్బులు కాజేసి పరారైన కరుణ పరపతి సంఘం నిర్వాహకుడు తొటం వెంకటయ్యను శని వారం మిల్స్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సుమారు 500 మంది సభ్యులు ఉన్న సంఘం ఒక్కొక్కరి నుంచి నిల్వ సుమారు రూ.12 వేలకు పైగా ఉన్నట్లు సభ్యులు చెబుతున్నారు. ఇటీవల సభ్యులు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించి సంఘం లావాదేవీలపై వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## మురికి కూపంగా రోడ్డు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ పక్కన ఉన్న రోడ్డు మురికి కూపంగా మారింది. డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఫలితంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుపై మురుగు నీరు చేరడంతో దుర్వాసనతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా రాత్రివేళ కంటి మీద కునుకు కరువైందని వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు.

## వృథాగా తాగునీరు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

హన్మకొండ : తాగునీరు లీకేజీ ద్వారా వృథాగా పోతున్నా వరంగల్ మహానగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండ ఎన్జీఓస్ కాలనీ రోడ్‌లో తిరుమల బార్ ఎదురుగా నెలల తరబడి పైపులైన్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఈ రోడ్డు మార్గాన ప్రయాణిస్తూ వారి కళ్లకు లీకేజీ కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేయాలని నగర వాసులు కోరారు.

## వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసీయొద్దీన్



రామన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

రామన్నపేట : వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసీయొద్దీన్ ఖాస్మీ, మహమ్మద్ అబ్దుల్ సుభాన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇస్లామియా మైదానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అమెండ్మెంట్ చట్టానికి వ్యతిరేకంగా నేడు (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు నగరంలోని ఇస్లామియా కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం గల దేశం అని. అన్ని మతాల ప్రజలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులను సమానంగా అందజేసిన దేశమని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ఈ విషయాన్ని మరిచి ప్రజలను కులాల, మతాల వారీగా విభజిస్తూ రాజ్యంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బహిరంగ సభకు ప్రధాన వక్తగా లాబోర్డు జాతీయ అధ్యక్షులు మౌలానా ఖాలీద్ సైపుల్ల రెహమాని, మంత్రి కొండా సురేఖ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రొఫెసర్ మనోకుమార్, చంద్రశేఖర్, ఆజాద్, ముస్లిం మత పెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ షా అలీ ఖాద్రీ, ఉబేత్‌బాబా, మౌలానా మీర్ ఇద్రీస్ అలీ ఎజాజా బియాబానీ, అబ్దుల్ రహమాన్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

**మోదీ ఫాసిస్టు విధానాలను అడ్డుకోవాలి**

న్యూశాయంపేట : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను అడ్డుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా నేడు(ఆదివారం) వరంగల్ ఇస్లామియా కళాశాల మైదానంలో ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో జరిగే సభకు న్యూడెమోక్రసీ మద్దతు తెలుపుతున్నటు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## అర్ధరాత్రి మొరం దందా

- మూడు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



హసన్‌పర్తి: చెరువు నుంచి అర్ధరాత్రి మొరం దందా చేస్తున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మూడు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు. నాగారం పెద్ద చెరువు నుంచి కొంత మంది అక్రమార్కులు అర్ధరాత్రి మొరం దందా చేస్తున్నారని నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు స్థానిక పోలీసుల సహకారంతో నీటి పారుదలశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకుని మూడు ట్రాక్టర్లు, జేసీబీనీ అదుపులోకి తీసుకున్నా రు. అక్రమార్కులు అక్కడి నుంచి పరారయ్యారు. చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానిక ఏఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వద్దు



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏఈ

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయొద్దని లబ్ధిదారులను ఎంపీడీఓ శంకర్‌నాయక్, హౌజింగ్ ఏఈ ఉదయశ్రీ కోరారు. మండలంలోని జమలాపురంలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను శనివారం వారు పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. బిల్లులు పనుల మేరకు మంజూరవుతాయని తెలిపారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి కాని ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. పనులను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. నిర్మాణ దశకు అనుగుణంగా అధికారుల క్షేత్రస్థాయి విచారణ అనంతర నివేదిక మేరకు లబ్ధిదారులకు డబ్బులు అందుతాయని వివరించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి దివ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణ సామాజిక బాధ్యత

వర్ధన్నపేట : బాలల రక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయూ) కౌన్సిలర్ నర్సింహస్వామి ఆకాంక్షించారు. మండలంలోని కట్ర్యాలలో బాలరక్ష భవన్, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలల రక్షణ చట్టాలు, మహిళల హక్కులపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో నర్సింహస్వామి మాట్లాడారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సెంటర్, బాల కార్మిక చట్టం, మానవ అక్రమ రవాణా, తల్లిదండ్రుల నిరాదరణకు గురైన బాలలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్లు సుష్మ, మౌనిక మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, ప్రేమ వివాహాలు, తదితరాలపై వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల, బాలల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 181 ఎళ్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు పోలీసు, న్యాయ, వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

## ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కేసులు



ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు : ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెడుతున్నారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ మండిపడ్డారు. మండలంలోని గుడెప్పాడ్ జాతీయ రహదారిపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోదీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల దిష్టి బొమ్మలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. బీహార్ రాష్ట్రంలో రాహుల్‌గాంధీని అంబేడ్కర్ యూనివర్సిటీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాహుల్‌గాంధీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదాసి శ్రీధర్‌తో పాటు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండాల క్రాంతి, దామెర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రవణ్, నాయకులు కిరణ్, వెంకటేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో యూనిట్ ఏర్పాటుకు శనివారం స్థలాన్ని గుర్తించారు. అలాగే ఆత్మకూరు, తిరుమలగిరిలో వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.64లక్షలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాకు రెండు యూనిట్లు మంజూరుకాగా ఒకటి హసన్‌పర్తిలో మరొకటి ఆత్మకూరులో నిర్మించనున్నట్లు చెప్పారు. త్వరలోనే కలెక్టర్ ద్వారా నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆత్మకూరు యూనిట్‌కు ఆత్మకూరు, దామెర, పరకాల, శాయంపేట, నడికూడ మండలాలను సమీకృతం చేస్తామన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో 100 నుంచి 300 వరకు ఉపాధి కూలీలు పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతీరోజు రూ.300 నుంచి రూ.307 వచ్చే విధంగా కొలతలు ఇవ్వాలన్నారు. రూ.250 కంటే తక్కువ పని చేయొద్దని కూలీలకు చెప్పాలని అన్నారు. కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, డీటీసీ శ్రీధర్, ఈసీ రాము, టీఏ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, అనూష, ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది రాజేశ్వర్‌రావు, రాంబాబు, నరేశ్, కుమార్ పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



కమలాపూర్ : ఆలయంలో హోమ పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు : ఆలయం నుంచి శోభాయాత్రకు బయలుదేరుతున్న స్వాములు

కమలాపూర్ : మండలంలోని గూడూరులో శ్రీ అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజస్తంభ స్థిర యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, గణపతి, గౌరీ పూజ, అఖండ దీపారాధన, రక్షాబంధనం, నవగ్రహ యోగిని వాస్తు క్షేత్రపాలక సర్వతోభద్ర మండప కలశ స్థాపన, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, గణపతి, గౌరి, రుద్ర, మన్యు సూక్త హోమం, విగ్రహాలకు పంచామృత అభిషేకం, విగ్రహాల ఊరేగింపు, మంత్రపుష్పం, సాయంత్రం వేద పారాయణం, శాంతిపాఠం, గణపతి పూజ, ఆవాహిత మండపారాధన, హోమం, విగ్రహాల జలాధివాసం, హారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు మఠం విజయ్‌కుమార్ స్వామి, గిరిమఠం సంపత్‌కుమార్ స్వామి, కమిటీ సభ్యులు, హనుమాన్ మాలధారులు, పాల్గొన్నారు. అలాగే ఉప్పల్, ఉప్పులపల్లిలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమాన్ శోభాయాత్రం వైభవంగా నిర్వహించారు.

**వైభవంగా హనుమాన్ శోభాయాత్ర**

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామంలో శనివారం శ్రీసీతారామ భక్తాంజేయస్వామి దేవాలయం నుంచి హనుమాన్ మాలధారులు శోభాయాత్ర నిర్వహించారు. దీంతో గ్రామంలో వీధులు జై హనుమాన్, శ్రీరామనామస్మరణతో మార్మోగింది. గురుస్వామి నరేష్, స్వాములు రాజు, నరేష్, రంజిత్, రాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

## దగ్గు వెంకన్న సేవలు చిరస్మరణీయం



వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల : ఏబీవీపీ సీనియర్ నేత దగ్గు వెంకన్న సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. పరకాలలో నక్సలైట్ల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన దగ్గు వెంకన్న 34వ వర్ధంతిని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాడు ఏబీవీపీ పరకాల బాధ్యుడుగానే కాకుండా పోరాటాల గడ్డ పరకాలలో కాషాయం జెండాను రెప రెపలాడించేందుకు పాటు పడిన వెంకన్న పోరాటాన్ని నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవునూరి మేఘనాథ్, ఆర్పీ జయంత్‌లాల్, చందుపట్ల రాజేందర్‌రెడ్డి, పూర్ణచారి, భిక్షపతి, శ్రీనివాస్, నారాయణదాసు, విజయ్‌కుమార్, పురుషోత్తం, నరేష్, రాంబాబు, శ్రీధర్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## అర్హులకు 'స్థానిక' ఎన్నికల్లో అవకాశం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నెక్కొండ : అర్హులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో శనివారం నిర్వహించిన నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ సంస్థాగత సన్నాహక ఎన్నికల సమావేశానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని చెప్పారు. కార్యకర్తలందరికీ సమయానుకూలంగా సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం పీసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, మేడి రవిచంద్ర మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా ఉందని అభినందించారు. నియోజకవర్గాన్ని ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలిపిన ఘనత మాధవరెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ అధిష్ఠానం మాధవరెడ్డి సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని ఆశిస్తున్నామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, నెక్కొండ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు అశోక్, గోపాల్ నాయక్, హరిబాబు పాల్గొన్నారు.